ఏమీ తోచక మెయిన్‌రోడ్డంతా కలయతిరిగాను. సిటీ ఎంపోరియమ్ ముందే మూడుసార్లు తిరిగాను. చటుక్కున గుర్తొచ్చింది-వెనకవీధిలోనే సుహాసినీవాళ్ళ యిల్లుందని. కాకివాడ వీధుల్లో వున్న సౌకర్యం అదే. మెయిన్‌రోడ్‌కి యిటు ఏ సందులోనుంచి వెళ్ళినా వేణుగోపాలస్వామి దేవాలయం వీధి, అటువెళ్తే సినిమాహాల్సున్న వీధి. అన్నీ సమాంతరంగా వుంటాయి.

వీధి అరుగుమీద-అటొకడూ యిటొకడూ-నోట్లో వేల్తోనూ, ఆకాశంవైపు చూస్తూనూ-సుహాసిని కొడుకులు ద్వారపాలకుల్లా కూర్చుని వున్నారు. వాళ్ళ తపస్సుకి భంగం కల్గించకుండా లోపలికి వెళ్ళాను.

# పిచ్చుక వేసిన బ్రహ్మాస్త్రం

## లలితా మన్నెమ



"ఒరే.ఎవర్రా వచ్చిందీ!" లోపల్నుంచి సుహాసిని కంఠం. భుజాలు తడుముకున్నా. సమాధానం చెప్పాలా, వద్దా అని. బొత్తిగా, 'ఒరే' అన్నది కదా, అని పలక్కుండా కూర్చున్నా. వంట గదిలోంచి చీర ఎగ్గట్టుకుని వస్తూన్నదల్లా నన్నుచూసి "బావా! ఎప్పుడు వచ్చితివి. కుశలంబేనా పెళ్ళాలూ, పిల్లలూ" అని దీర్ఘం తీస్తూ, కుచ్చెళ్ళు క్రిందకి లాక్కుంది. "నాకు తెలుగంత బాగా రాదయ్యా బావా! పెళ్ళాం, పిల్లా-అనాలి కదా! ఊఁ, ఎలావుంది నీ కూతురు? నీలాగే వుంటుందట కదా!"

నేను మాట్లాడలేకపోయాను. సుహాసినికి రాసే వుంటుంది మృదుల. ఏం చెప్పను? ఏమనుకుందో మళ్ళీ ఆ టాపిక్ ఎత్తలేదామె.

"అవునూ, చెట్టంత మనిషివి నువ్వొచ్చేవు కదా! ఎవర్రా వచ్చిందీ అంటే నా కొడుకుల్లో ఒక్కడేనా సమాధానం చెప్పాడేమో చూశావా?" అంది.

"నేనే చెబుదామనుకున్నాగానీ. నువ్వు మరీ బొత్తిగా "ఎవర్రా అక్కడ" అంటే నేనే మేడమ్ అనలేక వూరుకున్నా" అన్నాను.

నవ్వేసింది సుహాసిని.

"నీ సంగతి కాదు బావా! అడుగో- అ మిల్టన్‌గాడూనూ.వర్డ్స్‌వర్తూనూ! చూశావ్ కదా, వీధిలోనే వున్నారా! ఏదీ చూడరు!"

"ఇంగ్లీషు లెక్చరరనిపించావ్!"

"ఇంగ్లీష్ లెక్చరర్‌నని ఆ పేర్లు పెట్టలేదు బావా! ఇప్పుడే చూపిస్తా ఎందుకు పెట్టానో, చూడూ" అంది.

"ఒరే మిల్టనూ! ఇలా రారా!"

పెద్దబాబు- ఆరేళ్ళ బాలూ వచ్చాడు- నోట్లో వేల్తో సహా.

"ఇందాక ఇంట్లోకి ఎవరన్నా వచ్చార్రా?" అడిగిందామె.

"లేదమ్మా" అనేసి మళ్ళీ వేలు యధాస్థానంలో వుంచుకుని, వెళ్ళిపోయాడు.

"చూశావా! వీడి కళ్ళెదురుగా ఏం జరిగినా కూడా వీడికి కనబడదు. ఏమీ లేదంటాడు. కళ్ళున్న గుడ్డివాడు. అందుకే మిల్టన్!"

"ఒరే వర్డ్స్‌వర్తూ! ఇలా రారా!"

"ఏంతమ్మా" అంటూ వచ్చాడు. నాలుగో ఏడు వాడికి. అమిత గారాబం.

"ఇలా ఎవరన్నా రావడం చూశావా!"

"ఉహూ. ఆకాశంలోనమ్మా పిట్టలు ఎగుల్తూపోయాయి. లంగులంగుల పిట్టలమ్మా! మలేమో, మబ్బులొచ్చి, మళ్ళీ ఎలిపోయాయి. చందమామ, నచ్చిత్తాలేమో యింకా లాలేదమ్మా" అన్నాడు.

"చూశావా నా కొడుకు ప్రకృతి పరిశీలన! వీడే వర్డ్స్‌వర్త్. పోరా, ఆడుకో"

నవ్వాను.

"కాఫీ తెస్తా కూచో!"

"వద్దిప్పుడే తాగి వస్తున్నా."

"కాఫీకేం ఫర్వాలేదు, కూచో. కూచో."

సుహాసిని మాట శాసనమే! టీ పాయ్ మీదున్న ఫెమీనా పేజీలు తిప్పుతున్నా. కాఫీ తెచ్చిందామె. "తప్పులు చెయ్యని మనిషి వుంటాడా సుహాసినీ?" అన్నాను గొంతు పెగుల్చుగుని. "టు ఎర్రీజ్ హ్యూమన్. కానీ తప్పు తెలుసుకోవాలి కదా! మా ఆయన చూడు. ఎప్పుడూ అదే అంటారు. "నిన్ను ప్రేమించడం తప్పు- ఆ పని చేసేనా? పెళ్ళి చేసుకుని మరో తప్పు చేశా!

"నా తప్పు లిప్పుడే తెలుసుకున్నా సుహా! ఏం చేయను. టు ఫర్గివ్ యీజ్ డివైన్ అంటారు కదా! నన్ను .... దయ చేసి....క్షమించి....దేవతలా — నన్నొదిలి పెట్టవా"అని రిక్వెస్ట్ చేసేస్తారనుకో రోజూ,

"హెబ్బే! హబ్బే. 'నిను వీడని నీడను నేనూ. కలలో కూడా వదలని కథ నేనూ' అంటాను సో. మై బోయ్ తప్పు తెలుసుకొనుము నాయనా! తప్పుదారి నుంచి తప్పుకొనుము తమ్ముకుర్రా!" అంది అనర్గళంగా.

నేనేం చెబుతున్నానో సుహాసినికి తెలుసు. తనేం చెబుతూందో నాకు తెలుసు. కాని హాస్యంగా సంభాషణ మార్చేస్తూ చెప్పాల్సింది చెప్పి మరీ వదుల్తుంది. "ఎవరి దగ్గరనైనా ఎప్పటి కన్నా నేర్చుకొనుట ప్రధానం!" 'చంగమామ'లో ఒక అడ్వర్టయిజ్‌మెంటు బొమ్మ చూపిస్తూ అంది.

"నేర్చుకొనుటకు పసితనం ప్రతిబంధకం కాదు" అంది మళ్ళీ. ఒక తండ్రి కూతురికి పాఠాలు చెప్పాక. పళ్ళు తోముకోవడం నేర్పే బొమ్మ అది.

కాఫీ తాగీతాగ్గానే కప్పు నా చేతుల్లోంచి లాగేసుకుంటూ నవ్వింది. "డోంట్ మిస్టేక్ మి! నువ్వీ కప్పు. సాసరూ పట్టుకుపోతావన్న అపనమ్మకం నాకు లేదు. కాని నా కొడుకులు పుట్‌బాల్ ఆడరన్న నమ్మకం లేదు" అంది లోపలికి తీసుకు వెళ్తూ.

"ఏమిటలా కూర్చుండిపోయావ్? నా తెలుగు భాషా ప్రావీణ్యమునకా?"

"అదేం కాదు గానీ. వెళ్తా. చీకటి పడింది."

"ఆడపిల్లి వేమిటి? చీకటవత్తే ఏం? ఉండు కాసేపు. హెచ్. డబ్యూ. లాంగ్ ఫెలో రానీ!" అంది భర్త నుద్దేశించి. రామారావు బాగా పొడవూ. చాలా సన్నమూ! హెచ్. డబ్ల్యూ. అంటే హైటే కానీ వెయిట్ లేని—లాంగ్ ఫెలో అట! నవ్వేను.

"నీకు పేరెవరు పెట్టారో గానీ! నీ పేరు సుహాసిని.నీ ఇల్లు నవ్వుల గని!" అన్నాను.

"పేరులో ఏమున్నది నిధి. పెన్నిధి? అంతయూ ప్రేమనిధి నా మొగుడి పన్నిధి"

"అబ్బ! చంపకు తల్లీ. నా మొగుడూ. నా కొడుకూ అంటూ.వాటినికూడా సంస్కృతీకరించు" అన్నాను వీధిలోకి వస్తూ.

"అటులనే. అదెంత! నా చేతియందలి పని! ఎవరింటిని. భాషను. రూపును వారే క్రమముగా సరిదిద్దుకోవలెను కదా. బావా! అవునూ, ఇది ఏ అలంకారం?"

"నా ఒంటికి కారం! తల్లీ. నమస్కారం వస్తా."

"పోయిరమ్ము ఇంద్రా! అవునూ. మళ్ళీ ఎప్పుడొస్తావు? అసలెందుకొచ్చినట్టు? కాఫీ...."

"తల్లోయ్. కాఫీకోసం కాదులే.... మళ్ళీ వస్తానన్నాగా!"

"సరే మరి. లాంగ్‌ఫెలో రాగానే చెబుతాలే ఛార్లెస్ లేంబ్ వచ్చాడని" వీధిలోకి వచ్చి మరీ అంది. అది నా పేరు. మేకపిల్లలా మెత్తనివాణ్ణట!

* * *

"మీ మావగారేవన్నా ఉత్తరం రాశారా?" అన్నం పెడ్తూ అడిగింది అమ్మ.

మాట్లాడలేదు నేను.

"ఇదే సమయం. ఏం. ఆఖరు కూతురికి ఆ మాత్రం యివ్వడేమిటి? అలాగే బెట్టుగా వుండు. పెద్దాళ్ళందరికీ సారెలూ. కట్నాలూ ఇవ్వగా లేంది. ఆఖరు పిల్లకి.." రోజూ పాడే యిది. కాని యీ రోజు మరీ విసుగ్గా వుంది. "ద్వారకానాథ్ లేడూ, వాళ్ళవిడ పాతిక వేలు కట్నం తెచ్చిందా? కింద.... నేలమీద పడుకోమన్నాడ్రా మావగారు! మంచాలు తెచ్చుకో వద్దూ?....ఇదో. నీ కిష్టమని వంకాయ.... గుత్తి కూర వండాను."

ఆకలి చచ్చిపోయింది.

"మద్రాసులో వుంటున్నారా! బీచి అంటే ఎరగను. ఎక్కడికీ తీసికెళ్ళరు. దెబ్బతో వాళ్ళ బాబు గూడూరున్నుండి లారీలో. సామాన్లన్నీ వేసుకు చక్కా వచ్చాడు. ఇనప బీరువాలూ. డబల్ కాట్లూ...."

చేయి కడుక్కుని లేచిపోయాను.

"అదేమిట్రా?"

"ఆకల్లేదు."

బెడ్‌రూంలో కెళ్ళి ముసుగుతన్ని పడుకున్నా కళ్ళముందు సుహాసినీ. రామారావుల స్నేహం. ప్రేమ. దాంపత్యం-వాళ్ళ ఔన్నత్యంనన్ను హేళనచేస్తూకనిపించాయి.

రామారావు చిన్నతనంనుంచీ నాకు ఫ్రెండ్. సుహాసిని అతనూ వైజాగ్‌లో యూనివర్శిటీలో చదువుకున్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్తో పాటు వాడు యల్లెల్బి. యీమె జర్మన్‌లో డిప్లొమా తీసుకున్నారు. ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు. ప్రేమంటే ప్రేమ కాదు జన్మాంతర స్నేహంలాంటి ప్రేమ.

వర్ణాంతర వివాహం వల్ల ఇరుపక్షాల వాళ్ళూ వాళ్ళనిఆల్మోస్ట్ వెలివేశారు. ఇద్దరూ ఉద్యోగాల్లో సెటిలయ్యే వరకూ ఎన్నో ఎన్ని రకాలవో. యిబ్బందుల్ని ఎదుర్కొన్నారు— చిరునవ్వుతో.

మొదటిసారి ఆమెని చూపినప్పుడు—

"నా ఫ్రెండ్ వీడు మహేంద్ర" అన్నాడు రామూ.

"హాయ్ బావా!" అంది సుహాసిని చిలిపిగా.


ఆశ్చర్యంగా చూస్తూండిపోయాడు తను.


"మీ ఫ్రెండ్ అదిరిపోయాడు చూడు రామూ" పకపకా నవ్వింది సుహాసిని. "జనరల్‌గా అంతా భర్త స్నేహితుడనగానే అన్నయ్యగారూ అంటూ వరస కలిపేస్తారు. నా కది కిట్టదు. అందుకే ముందుగా బావా అన్నా. షాక్ ట్రీట్‌మెంట్! ఇక మహేంద్రగారూ! మీరు రామూకి లాగే. నాకూ ఫ్రెండ్.అంతే" అన్నదామె.

రామారావు తనని చూస్తూ నవ్వేశాడు-

"నోరు కొంచెం మూసుకోరా నాయనా! ఈగలు ఫ్రీ పాసెన్‌టూర్ కొట్టేస్తాయ్!" అంటూ. అప్పటి నుంచి సుహాసిని- బావా అనీ. తమ్ముకుర్రా అనీ. కుర్రాడా అని కూడా- నానా పిలుపులూ పిలుస్తుంది.

కప్పుకున్న రజాయిమీద కిచకిచమంటూ చిన్ని చిన్ని అడుగులు— పిచ్చుకల పరుగులు! ముఖం మీది ముసుగు తీసి చూశాను. రివ్వుమని ఎగిరిపోయాయి. బెడ్‌రూంలో ఓ కార్నర్లో గూడు కట్టాయి. అక్కడే నివాసం. బొద్దుగా. ముద్దుగా వుంది ఆడపిచ్చుక. కంఠానికి సహజ ఆభరణంలా






నల్లని మచ్చ— మెడ చుట్టూ.

ఒకదాని వెనుక— వెనుకే— మరొకటి. ఈ గదిలోంచి ఆ గదిలోకి.... మళ్ళీ గూట్లోకి. కిచకిచల పకపకలు. చిలుకలూ, గోరింకలూ అంటారుగానీ పిచ్చుకలు కళ్ళెదురుగా కన్పించే నిజమైన దాంపత్యానికి ప్రతీకలు!

ఆడపిచ్చుక పొట్ట ఉబ్బెత్తుగావుంది. మగ పిచ్చుక మరింత గారాబం చేస్తోంది దాన్ని! ఏవో తెచ్చి పెడుతూంది గూటిని మెత్తగా చేసేందుకు!

పొద్దుట షేవ్ చేసుకుంటూంటే గడ్డం తెగింది. కొంచెం డెటాల్లో ముంచి కాటన్ ఒత్తి వెనక్కి చూసేసరికి - దూదికాస్తా ఎత్తుకెళ్ళి గూట్లో పెట్టుకుంటోంది మగ పిచ్చుక!

బహుశా-గుడ్డు పెట్టేదశ కాబోలు!

'అంటే....? అంటే....?'

'పిల్లలంటే అంత ప్రేమ పక్షులకూ కూడా వుంటుందా? మరి....తను....! నా ఒళ్ళంతా ఏదోలా అయిపోతోంది. నేనేనా? నేనేనా యిలా ప్రవర్తించేది? నన్ను చూస్తే నాకే విపరీతమైన అసహ్యం వేస్తోంది

పాప పుట్టిందని తెలిసి - మూడు నెలలయినా చూడటానికి వెళ్ళలేదు. ఎందుకు? ఆ మాట తల్చుకోవాలంటేనే తన మీద తనకు అసహ్యం వేస్తోంది! మృదుల తన గురించి ఏమనుకుంటుందో? ఎంత అసహ్యించుకుంటుందో!'

'మృదులా!!

'మూడేళ్ళు- బస్‌లో సహచరి. మూడేళ్ళుగా- జీవన సహచరి. తన ప్రాణం- తన భార్య!

తన ప్రాణమనుకున్నది - తన భార్య కాగానే విలువ తగ్గిపోయిందా? నో.. నో.. మృదూ యీజ్ మై లైఫ్!

మృదుల తనని క్షమిస్తుందా? తనని బహుశా ఏమీ అనదు. ఒక చూపు చూస్తుంది! ఆ కళ్ళు.... ఆ కళ్ళు.... తను చూడలేడు! చూడకుండా వుండనూ లేడు!!

'ద మోస్ట్ ఎక్స్‌ప్రెసివ్ అయిస్!

ఆ కళ్ళు.... అన్ని భావాలనూ ప్రతిబింబించే అపురూప నయనాలు!

ఆరేళ్ళ కిందట—జూనియర్ ఇంజనీర్‌గా కాకినాడలో మొదట జాయిన్ అయినప్పుడు— స్టేట్ బ్యాంక్ కాలనీ దగ్గర బస్సెక్కిన అమ్మాయిని తను గమనించనే లేదు. ఆ అమ్మాయి ఒళ్ళో పుస్తకాలు చూసుకుంటూ కూర్చుంది, భానుగుడి దగ్గర స్టాప్‌లో ఇద్దరమ్మాయిలు—ఆమె ఫ్రెండ్స్ ఎక్కేవరకు. అప్పుడే ఎందుకో ఆ అమ్మాయి వేపు చూశాడు తను.

రెండు నక్షత్రాలు మిలమిల మెరుస్తున్నట్టు—పాలనురుగులాటి కళ్ళకు నెమలి పింఛపు అంచుల్లా కనురెప్పల చివరలు. సరిహద్దు రేఖలా సన్నని కనుబొమలూ— పసితనపు స్నిగ్ధత్వం ప్రతిబింబించే—అతి చక్కని కళ్ళు— ఆమెవి!

ఆనందంతో మెరిసే కళ్ళు. నవ్వే కళ్ళు మాట్లాడే కళ్ళు. కోపించే కళ్ళు- అలాటి కళ్ళు అంతకు ముందెపుడూ చూడలేదు తను. ఆశ్చర్యంగా ఆమెనే చూస్తూండేవాడు. వాళ్ళ మాట లేవీ అతనికి వినబడేవి కావు. కానీ— అన్నీ కనబడేవి— ఆమె కళ్ళలో.

ఒక జడ ముందుకు. ఒక జడ వెనక్కి నిష్పక్షపాతంగా వేసుకునేది. స్నేహితుల్తో ఏదో మాట్లాడుతూండేది.

"నిన్న రాలేదేమ్మా కాలేజీకి?" అన్నదిపుడు అనుకునేవాడు.

"ఆ సినిమా చూశావా?" అంటూ కిటికీలోంచి ఏదో పోస్టర్‌ని చూపిస్తోంది ఫ్రెండ్‌కి అనుకునేవాడు.

"ఎబ్బే! ఎంతసయ్యంగా వుందో జైమాలిని డ్రెస్సు!"

"అరవై యేళ్ళు దాటి మోకాళ్ళు పట్టుకుపోయి ఆ హీరో డాన్సు! భలే కామెడీ చేశాడే సుధా!"

"నిన్న మేడమ్‌గారి చీర చూశావా? ఇంతంచు జరీ బోర్డర్ భలే బావుంది కదూ!"

"ఏయ్. ఏయ్ లక్ష్మి "జడపాప" గారి వయారం నడకకి జడవూడి నవరం లేదూ.. ప్రిన్సిపాల్ రూమ్ముందు వూ..డి పోయిందేవ్!" పకపక నవ్వినట్టు.

ఇందులో ఒక్కటే ఆమె మాట్లాడగా అతడు వినలేదు. కళ్ళుచూసి వూహించుకునేవాడు.

మొదటినుంచి చివరిస్టాపు వరకూ—ఏదో మూలనుంచి అలా చూస్తూవుండే యీ సైలెంట్ అబ్జర్వర్నివాళ్ళూ అబ్జర్వ్ చేసేశారు కొన్నాళ్ళకు. భానుగుడిదగ్గర బస్సెక్కుతూనే "మృదూ! నీ ఆరాధకు డొచ్చాడా?" అని అడిగేది సుధ. 'ఛ. వూరుకో!' అన్నట్లు చూసి బయటకు చూసేదే తప్ప. తన వైపన్నా చూసేది కాదాయె.

ఆ అమ్మాయే మృదుల! ప్రేమించానని తనెప్పుడూ వెంటపడలేదు. ఆమె కూడా తనపై కుతూహలాన్ని ప్రదర్శించలేదు.

కాని కొన్నాళ్ళకు ఒంటరిగా పడుకున్నా నడుస్తున్నా, ఏం చేస్తున్నా రెండుకళ్ళు తనని చూసి నవ్వేవి. నవ్వించేవి. కవ్వించేవి. మాట్లాడేవి. గారం చేసేవి. ప్రేమ కురిపించేవి. కోపగించేవి....

"వద్దొద్దు ప్లీజ్! ఆ ఒక్క భావం ప్రదర్శించొద్దు" అనుకునేవాడు పైకే. ఆ అమ్మాయి ఫైనలియర్ కొచ్చింది. ఓణీలు మానేసింది. చీరలు- పొందికగా కట్టుకుంటోంది. రెండు జడలు ఏకమయ్యాయి.

అతని కన్పించింది- తామిద్దరూ- ఒకటే జంటగా- కన్నుల పంటగా- వుండిపోవాలని!

* * *

స్టేట్ బాంక్ కాలనీ ప్రశాంతంగా వుంది. "భోగందాని చెరువు" (క్షమించాలి. యిలా అనడం నాకిష్టం వుండదు. కాని అదే దాని పేరు!) మీది నుంచి చల్లని గాలి వీస్తోంది.

బస్ దిగి మృదుల వెనకే నడుస్తున్నాను. ఎప్పుడూ అలా వెంటపడలేదేమో వెనక్కి చూసింది రెండుసార్లు. 'ఆశ్చర్యం' పలికాయి కళ్ళు.

వెదుళ్ళతో కట్టిన గేటు తీసుకుని పూల

దారులలో ఆమె వెనకే నేనూ వెళ్ళాను. గోడమీద "డాక్టర్ పరమేశం. యమ్మే. పిహెచ్. డీ. రిటైర్డ్ ప్రిన్సిపాల్...." అన్న నేం ప్లేటుంది.

మృదుల వెనక్కి చూసింది.

"నాన్నగారితో మాట్లాడాలి. పిలవండి" మొదటిసారిగా ఆమెతో మాట్లాడేను. తల వూపి వెనుదిరిగింది. పెద్ద జడ వూగింది- నాట్యమాడే నాగినిలా.

ప్రిన్సిపాల్ గారితో మాట్లాడేను. ఆయన ఆశ్చర్యపోయారు. మృదులతో యిప్పటి వరకూ నేను మాట్లాడనే లేదన్నాను. మా యింట్లో యీ పెళ్ళికి ఒప్పుకోరన్నాను. కాని నా భార్యని నేను బాగా చూసుకో గల నని నా మనసులోని మాటలన్నీ చెప్పే శాను.

ఆయన కెన్నో సందేహాలు! ఆలో చించుకొమ్మని వచ్చేశాను.

* * *

"మిస్టర్ మహీంద్రా!"

మృదుల కంఠం బావుంది. ఆ పిలుపు మరింత బావుంది అంతా నన్ను మహేంద్ర మహేంద్ర అంటారు. ఈమె మహీంద్ర అన్నది. ఈ పేరేబావుంది అంది నామనసు. మరోసారి ఆ పిలుపు వినాలి!

"మిస్టర్ మహీంద్రా" అని కొంచెం గట్టిగా పిల్చింది ఈసారి. ఆగాను. "మీతో కొంచెం మాట్లాడాలి" ఆమె నడిచిన వైపే నడిచాను. చెరువు గట్టుమీద నడుస్తున్నాం ఇప్పుడు.

"నాన్నగారు నిన్న మీరొచ్చినవిషయం చెప్పారు. అయితే మీకు కొన్ని విషయాలు స్పష్టంగా చెప్పాలి" అన్నదామె.

"చెప్పండి."

"నాన్నగార్కి మేం ఆర్గురం సంతానం. అందులో ఆరోదాన్ని నేను. నల్గురక్కలూ ఒక అన్నయ్యా. అంతా పెళ్ళిళ్ళయి సెటి లైనవారే. నాన్న రిటైరై పోయారు. తెల్సిగా!"

"ఊ"

"ఆయన కట్నాలూ, కానుకలూ ఏమీ యివ్వలేరు."

"నాకేమీ అవసరం లే...."

"చెప్పనీయండి ప్లీజ్! అసలు నాకు పెళ్ళి చేసుకునే వుద్దేశమే లేదు-కట్నంతీసుకున్న వాణ్ణి చేసుకోనని కాదు-ఎవర్నీ. అయామ్ ఎయిటీన్నౌ. యమ్మే చేసి.ఏదన్నా వుద్యో గంచేసి....ఆ తర్వాతే!

అయితే నాన్నగారు అన్నారు ఎప్పటి కన్నా చేసుకోక తప్పదు — అని! నేనేం స్పిన్స్టర్‌గా వుండాలని అనుకోవడం లేదు. కట్నాలు యివ్వలేని వాళ్ళే ఆదర్శాలు వల్లిస్తారనుకోకండి.

"వ్యక్తిత్వం లేనివాళ్ళని చేసుకోవడం నాకిష్టం లేదు. మగా. ఆడా-ఎవరికైనా— ఒక వ్యక్తిత్వం వుండాలని....నా ఉద్దేశం. మీకు అర్థమౌతోందా?"

లెక్చరల్ ముందు స్టూడెంట్‌లా తల వూపాను.

"అమ్మకొంగు పుచ్చుకునే మగవాడెంతో. భార్య కొంగు పట్టుకు తిరిగేవాడూ అంతే! భర్తని సాధించే భార్యెంతో. కోడలిని సాధించే అత్తగారూ అంతే! భర్త పాదాలకు మొక్కే భార్యెంతో. ఆఫీసర్ల కాళ్ళు పట్టే మగవాళ్ళూ అంతే! ప్రతివారూ.ఎవరికి వారు- ఎవరి స్థానాలెక్కడో తెలుసుకుని- ఒకర్ని ఒకరు గౌరవించుకోవాలి. ఔనా?"

ఔనన్నాను.

"మీ ఇంట్లో నన్ను చేసుకోవడాన్ని యిష్టపడరన్నారు. ఆ తర్వాతెప్పుడన్నా వాళ్ళనుంచి మిమ్మల్ని విడదీసినట్టు ఫీలౌతారేమో?"

"నో నెవ్వర్! కానీ. మీ నుంచి ఎవ్వరు విడదీయాలనుకున్నా మాత్రమే భరించ లేను!" గబుక్కున గట్టిగా అనేశాను.

ఆమె కళ్ళు ముందాశ్చర్యపోయి నవ్వేసాయి!

* * *

మృదుల. నేనూ రిజిస్టర్ మారేజ్ చేసుకున్నాం. సూర్యకళా మందిరంలో రిసెప్షన్ యిచ్చాను నేను. రాము, సుహాసిని వచ్చారు.


సుహాసిని అందర్లోనూ స్టేజ్ మీదకు వచ్చి నా చేయి పట్టుకు వూపేసింది! "ఛార్లెస్‌లేంబ్ వనుకున్నా. గడుగ్గాయివే!" అన్నది.

వయసులో తేడా వున్నా మృదులా, సుహాసినీ స్నేహితులై పోయారు. ఆ మృదుల- నా మృదుల- నాకో పాపాయి నివ్వడానికి- మూడేళ్ళకి- అక్కగారింటికి వెళ్ళింది- తల్లి లేనందువల్ల. ప్రిన్సిపాల్ గారు కొడుకు దగ్గర వుంటున్నారు- విశాఖలో.

* * *

హఠాత్తుగా అమ్మ వచ్చింది. ఆమె వచ్చిన దగ్గర్నుండీ....

"అయ్యో! ఇది ఇల్లేనా? ఇలా బోడి





## ఇదిమీకు చాలా ఉపయోగం

మీకు 'వ్యవహారదర్శిని' అనే తెలుగుపుస్తకం చాలా ఉపయోగం. అందులో ఆస్తికొన్నా అమ్మినా తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాపార, పరిశ్రమలకె లాంటి లైసెన్సులు తీసుకోవాలి, అన్నిమతాల వివాహ, విడాకుల నిబంధనలు స్త్రీపురుషుల ఆస్తిహక్కులు, పెద్దవారితో ప్రమాదంరాబోతే పోలీసురక్షణకు ఎవరికెలావ్రాయాలి, ఇండ్లస్థలాలకెలా ధరఖాస్తు పంపాలి, లాడ్జింగుల్లో వ్యభిచారనిరోధరూల్సు, వాటినుంచి రక్షణవివరాలు, మీరుతెలుసుకోదగిన అనేక చట్టాలవివరాలు, నోట్లు, దస్తావేజులు, ఒప్పందాలు, పిటీషన్లు, ఫిర్యాదులు ఉత్తరాలు ఎలావ్రాయాలి, వాటివివిధ నమూనాలు అందున్నాయి. సుమారు 300 పేజీలపుస్తకం. ధర రూ!12. వి.పి. పోష్టుఖర్చు రూ!3. అదనం. దేశసేవ ప్రచురణలు, నెం.2, ఇందిరానగరు, వెంగలరావునగరు టాంకుసమీపాన హైదరాబాదు-500890కు. మీఉపయోగానికి వ్యవహారదర్శిని పుస్తకం ఒకటి వి.పి. పోష్టుద్వారా మీకు పంపించమని నేడే ఉత్తరంవ్రాయండి.

బొమ్మల్లే వుందేమిట్రా?"

"మీ మావగారు కట్నం ఇవ్వకపోతే పోయారు. సారే, సామానైనా ఇవ్వలేదా? అయ్యవారి నట్టిల్లులా వుంది కొంప."

ఎన్నో లోపాలు భూతద్దంలో చూపింది అమ్మ. నిజమా అనుకునేలా. ఆఫీసులో ప్రతివాడూ—ఈవాచి మావగారు పెట్టారనో, ఈసూటు అత్తగారు కుట్టించారనో, పండక్కి వాళ్ల చేసే హడావుడి గురించో, "సూక్కటరడగాలి మా మామని ఛస్తా పట్టుకుపోతాడా అంత ఆస్తి" అనో అనే మాటలు నాలో—గొప్ప ఆదర్శ పురుషుడ్ని అనుకొనే నాలో విషబీజాలు నాటాయి.

ఒక రోజు రాత్రి అమ్మ నిద్రలేపింది టెలిగ్రాం వచ్చిందని.

"పాప పుట్టిందట ఉదయం. ఇద్దరూ క్షేమం. రమ్మన్నారు" అన్నా సంబరంగా. "నాయనా నువ్విప్పుడు పెద్దవాడివయ్యావు. నిన్ను కని పెంచిన తల్లి వుందని నువ్వు మర్చిపోయావు" అంది కన్నీరు పెకుతూ హఠాత్తుగా.

'నిజమే- ఆమె నీ తల్లి! ఎంత కష్టపడి నిన్ను పెంచిందీ!' అన్నది నా మనసు.

"ఏంటమ్మా?" అన్నా ప్రేమగా.

"బాబూ! లోకం తెలియదు నీకు. నీకేం చెప్పారో- ఏమో- ఓ కట్నం, కానుకా- ముద్దూ, ముచ్చటా లేకుండా వల్లో వేసుకున్నారు. కనీసం పెళ్ళి గురించి నువ్వు చెప్పకపోతే పోనీ వాళ్ళన్నా నాకు తెలియజేశారూ?"

"అది కాదమ్మా."

"బాబూ! ఇప్పుడు నాకేం చెప్పకు నేను చెప్పినట్టు విను.... వింటావా?"

"ఏమిటమ్మా?" నా మనసు వద్దంటోంది.

"నా మీద ఒట్టే బాబూ! నువిప్పుడు వెళ్ళొద్దు. అంతే. నేను చెప్పినట్టు వినిచూడు తెలుస్తుంది. నా మీద ఒట్టే" అని లోపలకు వెళ్ళిపోయింది.

అవాక్కై నిల్చుండిపోయాను.

* * *

పిచ్చుక పొడుస్తూంది-నన్నే. ప్రొద్దుటే దీని కిచకిచ సుప్రభాతం! పిచ్చుకకి భయమంటారు! కాని దీనికి బొత్తిగా భయంలేదు. మళ్ళీ రజాయిమీద నడుస్తూ కిచకిచ అరుస్తూ పొడుస్తూంది.

"ఏమిటి నీ గొడవ?" విసుక్కున్నా.

కిటికీ గ్లాస్ డోర్స్ మీదకెగిరి, కాళ్ళతో తన్ని, కిచకిచమంది.

"ఓహో! తలుపు తియ్యమనా?"—తీశాను లేచి.

తుర్రుమని బయటకెళ్ళి- రివ్వున లోపలికొచ్చింది. గూట్లో ఆడపిచ్చుక మూల్గుతోంది.

'అదా సంగతి' అనుకున్నా.

దూదీ, మెత్తని గడ్డి, ఏవేవో ముక్కుతో తెచ్చి గూటిలో పెడుతోంది. ఆడపిచ్చుకతో పాటు బాధ పంచుకుంటూ, కీస్ కీస్ మంటూ సానుభూతి చెబుతూ గూటిచుట్టూ రెక్కలు టపటప లాడిస్తూ తిరుగుతోంది!

ముఖం కడుక్కోగానే అమ్మ కాఫీ తెచ్చింది.

"రాత్రి అన్నం తిన్నేలేదు. టిఫిన్...."

అమ్మ మాటల్లో ఆప్యాయత కనిపించలేదు. మాతృత్వం బదులేదో రాక్షసత్వం కనిపించింది. తన నెదిరించి- ఒక్క పని—అదీ నా సహచరిని- ఎన్నుకున్నందుకు- గొయ్యితీసి- నన్ను అందులో తోస్తున్నట్టు అనిపించింది.

అమ్మ స్వభావం నాకు తెలుసు. తన మాట కాదంటే- ఎప్పుడో ఒకప్పుడు వాళ్ళని గురిచూసి- దెబ్బతీసి- తనదే పైచేయి అనిపించుకునే- అమ్మ స్వభావం నాకు తెలుసు! అయితే ఇప్పుడు మృదులనీ.. తననీ....


"నో! నెవ్వర్" అరవబోయి, ఆపుకున్నా.

"నిన్ను నా నుంచి ఎవ్వరు విడదీసినా భరించలేను అన్నావుగా, మహీ?" మృదుల కళ్ళు హేళనగా నవ్వినట్లనిపించింది.

బయటి కెళ్ళిపోయాను. అర్ధరాత్రిగ్గానీ యిల్లు చేరలేదు.

* * *

గలివర్ అండ్ లిలీపుట్స్ కథలోలా-




నామీద పిచ్చుకలెక్కి గోల చేస్తూంటే లేవక తప్పలేదు. గూట్లోంచి బుజ్జి పిచ్చుక నా రజాయి మీద పడిపోయింది. దానిచుట్టూ తల్లీ, తండ్రీ తిరుగుతూ, అరుస్తూ, ఏడుస్తున్నాయ్. జాగ్రత్తగా బయటపడి పిచ్చుక పిల్లని చూశాను. అమ్మయ్య! బ్రతికే వుంది!!

నిచ్చెన తెచ్చి పిల్లని భద్రంగా ఎత్తి గూట్లోకి చేర్చాను. అంతసేపూ మగ పిచ్చుక నా నెత్తిమీద పొడుస్తూనే వుంది. దాని పిల్లని ఏం చేసేస్తున్నానో!

"అబ్బ! పోవే. నువ్వు నాకు మొగుడివై పోయావు" అనుకుని నిచ్చెన దిగి అద్దంలో చూసుకున్నా నా జుట్టు. 'పిచ్చుక గూడు'లా వుంది! అప్పుడే నాకేదో తట్టింది!

* * *

పదింటికి ఆఫీసుకి బయల్దేరి, వెంటనే వచ్చేసిన నన్ను చూసి ఆశ్చర్యపోయింది అమ్మ.

"చెల్లి వైరిచ్చిందమ్మా అర్జంటుగా నిన్ను పంపమని."

"అమ్మో! దాని వంట్లో ఎలా వుందో.." పెట్టె సర్దుకోసాగిందామె.

సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో అమ్మ ఎక్కిన కంపార్టుమెంటుకి రెండు బోగీలవతల నేను ఎక్కడం గుంటూరులో దిగిపోవడం—అమ్మకు తెలియదు. అసలు చెల్లి టెలిగ్రామే యివ్వలేదన్నది తెలిసివుండొచ్చు—తర్వాత!

* * *

నా డైరీ చదవడం ఆపి, నావైపు చూసింది మృదుల.

"అందుకే మృదూ! ఆ పిచ్చికలంటే నా కిష్టం. ఆ గూడు తీసెయ్యకు ప్లీజ్!" అన్నాను—యిల్లు దులిపే కార్యక్రమం చేపట్టిన మృదులను.

"పిచ్చుకలు చెప్పేవరకూ దాంపత్యం ఎలా వుండాలో తెలుసుకోలేని మూర్ఖుణ్ని. తెలుసుకోవడానికి తగిన బుద్ధీ జ్ఞానం వుండాలిగానీ. ఎవరున్నుండన్నా నేర్చుకోవచ్చు. అయినా నువ్వీసారి ఎక్కడికీ వెళ్ళద్దు. ఆ ఒంటరితనం నే భరించలేను!" ఉలికిపడింది మృదుల.

"ఇంకోసారా! ఆ బాధలు నే భరించలేను."

"మరయితే బుల్లి మహీ వద్దా?" అన్నా- ఆమె కళ్ళని చుంబిస్తూ. ఆ కళ్ళలో అసహ్యం లేదు. థాంక్ గాడ్!

"మహీ! డోంట్ లీవ్ మీ!" అంది ఆర్తిగా నా మెడ చుట్టూ చేతులేస్తూ.